క్లుప్తంగా

రెండు ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు

నేడు ప్రారంభించనున్న ఎమ్మెల్యే కసిరెడ్డి



ప్రారంభానికి సిద్ధంగా జిమ్

ఆమనగల్లు: ప్రజా సౌకర్యార్థం పురపాలక సంఘం ఏర్పాటు చేసిన రెండు ఓపెన్‌జిమ్‌లను మంగళవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రారంభించనున్నారని కమిషనర్ శంకర్‌నాయక్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి మంజూరు చేసిన రూ.26 లక్షలతో ఆమనగల్లు పట్టణంలోని ధరణి వెంచర్, కేవీ వెంచర్‌లో వీటిని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

స్కూల్‌బ్యాగ్‌ల పంపిణీ



దాత అందించిన బ్యాగులతో విద్యార్థులు

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం పడకల్ గ్రామం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మాజీ సర్పంచ్ కాడమోని శ్రీశైలం.. సోమవారం బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, అనంతలక్ష్మి, బౌరమ్మ, స్థానిక నాయకులు నవీన్, మల్లేశ్, జంగయ్య, సాయి పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి



రికార్డులు పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి అరుణకుమారి

మాడ్గుల: నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులు అందుబాటులో ఉంచాలని మండల వ్యవసాయ అధికారి అరుణకుమారి అన్నారు. సోమవారం మాడ్గుల మండలం బ్రాహ్మణపల్లి, నల్లచెరువు గ్రామాల్లో ఆమె ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. విత్తనాలు, పురుగు మందుల నాణ్యతను పరిశీలించారు. నాసిరకం, నకిలీవి విక్రయిస్తే తగిన చర్యలు తీసుకుంటామని దుకాణ దారులను హెచ్చరించారు. ఆమెతో వ్యవసాయ విస్తరణ అధికారులు జోత్స్న, భార్గవి, రాజేష్ ఉన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి



విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న దాత

కడ్తాల్: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి, ఉన్నత స్థానాలకు చేరుకోవాలని విద్యా స్వేచ్ఛ ఫౌండేషన్ చైర్మన్ వాసుదేవరావు అన్నారు. సోమవారం కడ్తాల్ మండలం మక్తమాధారం ప్రాథమికోన్నత పాఠశాల చిన్నారులకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నోటుబుక్స్, పెన్నులు, పెన్సిల్స్ తదితర స్టేషనరీ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మరిన్ని సర్కారు బడుల విద్యార్థులకు స్టేషనరీ, క్రీడా సామగ్రి అందజేస్తానని తెలిపారు. హెచ్‌ఎం సంతోష్‌కుమార్, ఉపాధ్యాయులు సునీత, లక్ష్మీనారాయణ, సుభాషిణి, భార్గవి పాల్గొన్నారు.

ప్రజావాణిలో 8 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీఓ అనంతరెడ్డి

ఇబ్రహీంపట్నం: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఇబ్రహీంపట్నం డివిజన్ స్థాయి ప్రజావాణిలో 8 అర్జీలు అందాయని ఆర్డీఓ అనంతరెడ్డి తెలిపారు. భూ సమస్యలపై ఏడు, ఇంటి నిర్మాణానికి సంబంధించి ఒక దరఖాస్తు వచ్చిందని పేర్కొన్నారు. ఆయా శాఖల అధికారులకు అర్జీలను పంపి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

4న జై సంవిధాన్ సభ

చేవెళ్ల: ఈ నెల 4వ తేదీన ఎల్బీ స్టేడియంలో జరిగే జైబాపు, జైభీం, జైసంవిధాన్ సభను జయప్రదం చేయాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద సోమవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ.. సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హాజరు కానున్నట్లు తెలిపారు

మాల్‌కు.. మహర్దశ

- ఇప్పటికే ఆత్మ నిర్భర్ కింద ఎంపిక
- పంచాయతీ ఖాతాలో జమైన పారితోషికం
- మరింతగా అభివృద్ధి చెందే అవకాశం



మాల్ పంచాయతీ కార్యాలయం

యాచారం: జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన మాల్‌కు మహర్దశ పట్టనుంది. 2025 ఏడాదికి రాష్ట్రంలోనే మాల్ గ్రామం.. 'ఆత్మ నిర్భర్ ప్రత్యేక పంచాయతీ జాతీయ అవార్డు'ను కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. అవార్డుతో పాటు రూ.కోటి నిధులు పంచాయతీ ఖాతాలో జమయ్యాయి. దీంతో ఆ గ్రామం మరింత అభివృద్ధి చెందనుంది.

అత్యధిక ఆదాయంతో గుర్తింపు

జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏప్రిల్ 24న బీహార్ రాష్ట్రంలోని మదుబన్‌లో ప్రధాని నరేంద్రమోదీ చేతుల 'ఆత్మ నిర్భర్' అవార్డును పంచాయతీ కార్యదర్శి రాజు అందుకున్నారు. జూన్ 12న కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.కోటి పారితోషికం సైతం పంచాయతీ బ్యాంకు ఖాతాలో జమ అయింది. ఇదిలా ఉండగా.. గ్రామానికి పశువుల సంత ద్వారా ఏటా రూ.80 లక్షలకు పైగా ఆదాయం వచ్చేది. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పంచాయతీ రాజ్ ఉన్నతాధికారులను నాటి ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి ఒప్పించి, గ్రామ ప్రత్యేక ఆదాయం కింద అవార్డు దక్కేలా కృషి చేశారు. దీంతో ప్రభుత్వం ఆయనతో పాటు ఎంపీఓ శ్రీలత, కార్యదర్శిని అభినందించింది.

నిబంధనల మేరకే..

అవార్డు కింద అందిన పారితోషికం రూ.కోటితో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తామని కార్యదర్శి రాజు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలు, నిబంధనల ప్రకారమే ఆ నిధులు ఖర్చు చేస్తామని చెప్పారు. ఖర్చు చేసే ప్రతి రూపాయికి రికార్డుతో పాటు ఫొటోలతో సహా నివేదిక తయారు చేసి, భద్రపరుస్తామని పేర్కొన్నారు.

ఉద్యోగ విరమణ సహజం

కడ్తాల్: ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమని తహసీల్దార్ ముంతాజ్, ఎంపీడీఓ సుజాత, ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిరేఖ అన్నారు. మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖలో గ్రేడ్- 1 సూపర్‌వైజర్‌గా పనిచేసి భక్త శబరి ఉద్యోగ విరమణ పొందారు. ఈ మేరకు సోమవారం మండల పరిధి మైసిగండి గ్రామంలోని ఓ ఫంక్షన్ హాలులో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్త శబరిని అధికారులు, నాయకులు ఘనంగా సన్మానించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ.. ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌గా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, మహిళల సంక్షేమానికి ఆమె అంకితభావంతో పనిచేశారని గుర్తుచేశారు. ఉద్యోగ ప్రస్థానంలో అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, ఐసీడీఎస్ సిబ్బంది ఉన్నారు.



భక్త శబరిని సన్మానిస్తున్న అధికారులు, ఐసీడీఎస్ సిబ్బంది

ప్రభుత్వ భూమిని కాపాడండి

అబ్దుల్లాపూర్‌మెట్: ప్రజా ప్రయోజనాల కోసం వదిలిన భూమిని కొందరు ఆక్రమించడానికి యత్నిస్తున్నారని, వారి నుంచి జాగను కాపాడాలని ఇందిరమ్మ కాలనీ వాసులు కోరారు. సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మండల పరిధి మజీద్‌పూర్‌లోని సర్వే నంబర్ 24,26 లోని భూమిలో గతంలో ప్రభుత్వం ఇదిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టి, ప్రజల కోసం కేటాయించిన వెయ్యి గజాల స్థలాన్ని కబ్జా చేసేందుకు స్థానికులు యత్నిస్తున్నారని ఆరోపించారు. ఇదేమని ప్రశ్నించిన వారిని బెదిరిస్తున్నారని తెలిపారు. ఆ స్థలంలో కమ్యూనిటీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి శంకుస్థాపన చేశారని, ఆ శిలాఫలకాన్ని సైతం ధ్వంసం చేశారని వాపోయారు. సదరు వ్యక్తులపై తగిన చర్యలు తీసుకొని, స్థలాన్ని కాపాడాలని కోరారు. రాజారాంచారి, వెంకటేశ్, కుతాడి సుధాకర్, యాదయ్య, నరేష్‌లు ఉన్నారు.

సర్కారు బడుల అభ్యున్నతికి కృషి



పాఠశాలకు మైక్‌సెట్ అందజేస్తున్న టీసీఎస్ ప్రతినిధులు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పీఆర్‌టీయూ ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షుడు డాక్టర్ వర్కాల పరమేష్ అన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ ఆదిబట్ల ప్రాథమిక పాఠశాలకు టీసీఎస్ ప్రతినిధులు రూ.12 వేల విలువ చేసే మైక్‌సౌండ్స్, 40 కాపర్ వాటర్ బాటిల్స్, క్రీడా సామగ్రిని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా పరమేష్ మాట్లాడుతూ.. పేద పిల్లలు చదువుకునే పాఠశాలల బలోపేతానికి దాతలు ముందుకు రావాలని కోరారు. టీసీఎస్ ప్రతినిధులు హర్ష, రామ్మోహన్, నవీన్, ప్రధానోపాధ్యాయురాలు భారతి, ఉపాధ్యాయులు లక్ష్మీదేవి, బాషయ్య, రామ్మోహన్, బుచ్చయ్య, లక్ష్మయ్య, అశోక్ పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

ఇబ్రహీంపట్నం: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 9న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఇబ్రహీంపట్నం ఐసీడీయూ ప్రాజెక్ట్ కార్యాలయంలో సమ్మె నోటీసును అందజేశారు. సమ్మెలో పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొనాలని కోరారు. కార్మికసంఘం నాయకుడు కృష్ణ, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు బాలమణి, వినోద, శోభ, లక్ష్మి, విజయ, దివ్య, సుగుణ, సంతోష, జ్యోతి, కళావతి తదితరులు పాల్గొన్నారు.



ఐసీడీఎస్ అధికారికి సమ్మె నోటీసు అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీలు

ఇబ్బంది పెడితే కేసులు పెడతాం

హిజ్రాలను హెచ్చరించిన సీఐ గురువారెడ్డి

మహేశ్వరం: మామూళ్ల పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే సహించేదిలేదని ఇన్‌స్పెక్టర్ పి.గురువారెడ్డి హెచ్చరించారు. సోమవారం పోలీస్‌స్టేషన్‌లో హిజ్రాలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డబ్బులు కావాలంటూ దుకాణదారులు, బాటసారులు, వాహనదారులను ఇబ్బంది పెడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. డబ్బులు ఇవ్వని వారి పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని ఫిర్యాదులు అందాయని పేర్కొన్నారు. ఇకపై రోడ్లపై న్యూసెన్స్ చేస్తూ, ఎవరిని ఇబ్బంది పెట్టినట్లు సమాచారం వస్తే కేసులు నమోదు చేస్తామని చెప్పారు. నేరాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఇకమీదట హిజ్రాలందరిపై నిఘా ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ లక్ష్మణ్ పాల్గొన్నారు.



హిజ్రాలతో మాట్లాడుతున్న సీఐ

గ్రామాల అభివృద్ధికి కృషి



రావులపల్లిలో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య, నాయకులు

ఎమ్మెల్యే కాలె యాదయ్య

శంకర్‌పల్లి: గ్రామాల అభివృద్ధికి నాయకులు, ప్రజలు పార్టీలకతీతంగా కృషి చేయాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. సోమవారం మండలంలోని రావులపల్లి గ్రామ చౌరస్తాలో రావులపల్లి- సంకేపల్లి గ్రామాల మధ్య రూ.2.50కోట్లతో నిర్మించనున్న బీటీరోడ్డు నిర్మాణ పనులు, రూ.55లక్షలతో సంకేపల్లి చౌరస్తా నుంచి గ్రామం వరకు చేపట్టే సీసీరోడ్ల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి పెద్దఎత్తున నిధులు మంజూరు చేస్తోందని స్పష్టం చేశారు. ఎన్నో ఏళ్ల నుంచి రోడ్డు సరిగా లేక ఇబ్బంది పడుతున్న గ్రామస్తులు.. పనులు ప్రారంభించడంతో హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాశెట్టి చంద్రమోహన్, పీఏసీఎస్ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, పంచాయతీరాజ్ డీఈ శ్రీధర్, ఏఈ నంద కిశోర్, ఎంపీఓ గిరిరాజు, నాయకులు పరమేశ్వర్‌రెడ్డి, హనుమంత్‌రెడ్డి, సంజీవరెడ్డి, గోపాల్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

చేవెళ్ల: ఆధ్యాత్మికత చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మున్సిపాలిటీ పరిధి చంద్రారెడ్డినగర్ పోచమ్మ ఆలయం మొదటి వార్షికోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. సొసైటీ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, సమత దంపతుల కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి, కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ శైలజ ఉన్నారు.

విద్యార్థుల ఉత్తమ ప్రతిభకు ప్రశంస



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు, చిత్రంలో సీఐ గంగాధర్, పోలీసులు, ఉపాధ్యాయులు

కడ్తాల్: అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణ వ్యతిరేక వారోత్సవాలను పురస్కరించుకుని మండల పరిధి పాఠశాలల్లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో వారం రోజుల క్రితం నిర్వహించిన యాంటీ డ్రగ్స్‌పై డ్రాయింగ్ పోటీల్లో పలువురు విద్యార్థులు ప్రతిభ చూపారు. లక్ష్మీభవానీ, తరుణ్‌కుమార్, శ్రావణి, కిరణ్‌కుమార్, అరవింద్, రాంచరణ్, సంజనలు ప్రథమ స్థానం, మరో 14 మంది విద్యార్థులు ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచారు. ఈ మేరకు సోమవారం కడ్తాల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు కార్యక్రమంలో విద్యార్థులకు సీఐ గంగాధర్ ఆధ్వర్యంలో ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో చదవి, ఉన్నతంగా రాణించాలని సూచించారు. ఎస్ఐలు వరప్రసాద్, చంద్రశేఖర్, హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, హెచ్‌ఎమ్‌లు అరుణ, జంగయ్య, జైసన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు



మొయినొద్దీన్‌ను సన్మానిస్తున్న మాజీ ప్రజాప్రతినిధులు

ఆమనగల్లు: ప్రభుత్వ ఉద్యోగులు విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తే ఎక్కడైనా గుర్తింపు లభిస్తుందని మున్సిపాలిటీ మాజీ చైర్మన్ రాంపాల్‌నాయక్, మాజీ వైస్ చైర్మన్ దుర్గయ్య, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు అన్నారు. వాటర్‌లైన్ మెన్‌గా పనిచేసిన ఎండీ మొయినొద్దీన్ ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా సోమవారం పురపాలిక సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనను ఘనంగా సన్మానించారు. మొయినొద్దీన్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బడంగ్‌పేట్ నగర పంచాయతీ అసిస్టెంట్ కమిషనర్ శ్యాంసుందర్, మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్, పలువురు మాజీ కౌన్సిలర్లు, వార్డు సభ్యులు, పుర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు చేయూత

మొయినాబాద్‌రూరల్: విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని జేబీఆర్ ఆర్కిటెక్చర్ కళాశాల చైర్మన్ గాయత్రి అన్నారు. మున్సిపల్ పరిధిలోని ఎన్కెపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్, స్టేషనరీని ఆమె కళాశాల తరఫున అందజేశారు.

కరెంట్ కష్టాల నుంచి కాపాడండి

ఆమనగల్లు: కరెంటు కష్టాల నుంచి ప్రజలను కాపాడాలని బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యా నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం విద్యుత్ శాఖ ఏడీఈ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా అయిందని, ప్రస్తుతం తరచూ సరఫరాకు అంతరాయం కలుగుతోందని పేర్కొన్నారు. కరెంటు ఎప్పుడు పోతుందో, ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి నెలకొందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి, గృహ అవసరాలకు 24 గంటల పాటు నాణ్యమైన కరెంటు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏడీఈకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనునాయక్, నాయకులు బాలస్వామి, వెంకటయ్య, సైదులుగౌడ్, రమేశ్‌నాయక్, మల్యానాయక్, శ్రీకాంత్, భాస్కర్, గణేశ్, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



ఏడీఈకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బ్యాంకు సేవలను వినియోగించుకోండి



భవనాన్ని ప్రారంభిస్తున్న మేనేజర్ విజయ్‌కుమార్ తదితరులు

కడ్తాల్: కెనరా బ్యాంకు సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆ బ్యాంక్ మేనేజర్ విజయ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని బ్యాంకును నూతన భవనంలోకి మార్చారు. సోమవారం ఖాతాదారులతో కలిసి భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ.. ఖాతాదారుల శ్రేయస్సే లక్ష్యంగా సేవలు అందిస్తున్నామని తెలిపారు. రైతులకు వ్యవసాయ రుణాలతో పాటు, బంగారం, వాహనాల కొనుగోలు, ఇంటి నిర్మాణం, ఉన్నత విద్య, వ్యాపార తదితర వాటికి రుణాలు ఇస్తామని పేర్కొన్నారు. పొదుపు ఖాతాలు, రుణ సదుపాయాలు, డిజిటల్ బ్యాంకింగ్, సామాజిక బాధ్యత కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య, జహంగీర్‌అలీ, యాదయ్య, షాబుద్దీన్, రాములుయాదవ్, బిక్కునాయక్, లక్ష్మీనారాయణ, బ్యాంక్ సిబ్బంది, ఖాతాదారులు ఉన్నారు.

రిజర్వేషన్ల తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

కడ్తాల్: బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు పిప్పల వెంకటేశ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆ సంఘం నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. బీసీ సంఘాల పోరాట ఫలితంగానే కేంద్రం ప్రభుత్వం దిగివచ్చి, త్వరలోనే దేశ వ్యాప్తంగా కులగణన చేపడతామని ప్రకటించిందని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి పెంచి, రిజర్వేషన్లు సాధించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలన్నారు. బీసీలకు జనాభా ప్రకారం విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు హెచ్‌ఆర్ మహేశ్, రాజేందర్‌గౌడ్, మహేశ్, ఉపేందర్, శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం



కుర్మల్‌గూడ చెరువుకట్ట పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

భగీరథ ట్యాంకులను పట్టించుకోని ప్రభుత్వం

- ఎమ్మెల్యే సబితారెడ్డి
- చెరువు బ్యూటిఫికేషన్ పనుల పరిశీలన
- పనులు వేగవంతం చేయాలని సూచన

బడంగ్‌పేట్: మిషన్ భగీరథ ట్యాంకులు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నా.. కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవటం లేదని ఎమ్మెల్యే సబితారెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో ట్యాంకులను నిర్మించి, ఇంటింటికీ తాగునీరు అందించామని.. నేడు ఆ పరిస్థితి కనిపించడం లేదని ఆరోపించారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు రేవంత్‌రెడ్డి సర్కార్ కృషి చేయాలని సూచించారు. సోమవారం బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధి కుర్మల్‌గూడ అంతిరెడ్డి చెరువు సుందరీకరణ పనులను ఆమె పరిశీలించి మాట్లాడారు. చెరువుల సుందరీకరణ పనులు వేగవంతంగా పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తేవాలని అధికారులకు సూచించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో ఈ చెరువుకు రూ.కోటి మంజూరు అయ్యాయని గుర్తుచేశారు. ఆ నిధులతో చెరువు బ్యూటిఫికేషన్ పనులు మొదలు పెట్టామని తెలిపారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్లు పనులు నాణ్యతగా చేపట్టి, సకాలంలో పూర్తి చేసేలా అధికారులు పర్యవేక్షించాలని చెప్పారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రోహిణి, భాస్కర్‌రెడ్డి, జంగయ్య, భాస్కర్, కీసరి భాస్కర్‌రెడ్డి, కరీం, వెంకట్‌రెడ్డి, జనన్మోహన్‌రెడ్డి, కుమార్‌గౌడ్, కృష్ణారెడ్డి, నరేష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

నియామకం

యాచారం: మదర్ డెయిరీ కుర్మిద్ద సొసైటీ అధ్యక్షుడిగా బందె మహేందర్‌రెడ్డి మరో సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు సోమవారం రైతులు ఆయనకు తీర్మాన పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ మాట్లాడుతూ.. రైతు సంక్షేమం, ఆర్థిక ప్రగతే లక్ష్యంగా కృషి చేస్తానన్నారు.



మహేందర్‌రెడ్డికి తీర్మాన పత్రం అందజేస్తున్న రైతులు